www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 3 జులై 2025

5

చిత్తూరు

9న జగన్ చిత్తూరు జిల్లా పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
ఈనెల తొమ్మిదో తేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు రానున్నారు. బంగారుపాళ్యంలోని మామిడి రైతులను ఆయన పరామర్శించనున్నారు. అలాగే మార్కెట్ యార్డ్ సందర్శించి రైతులను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

ఏడాదిలో కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు

- కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా అడుగులు
- ఆలయాల అభివృద్ధికి రూ.50 కోట్లు
- నియోజకవర్గం అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రణాళిక
- అభివృద్ధికి, సంక్షేమానికి సైకిలే బెస్ట్
- కుప్పం ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు సంబంధించి నాలుగు కంపెనీలతో ఒప్పందాలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, శాంతిపురం, కుప్పం రూరల్
కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం శాంతిపురం మండలం తుమ్మిశిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బహిరంగ సభ కార్యక్రమానికి ముందు కుప్పం ప్రాంత అభివృద్ధికి సంబంధించి రూ.1207.90 కోట్ల విలువతో కూడిన పలుప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ప్రత్యేక పథకాలకు చెందిన శిలాఫలకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఒక సంవత్సర కాలంలో పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు రూ.120.42 కోట్లు ఖర్చు చేశామన్నారు. 30.14 కి.మీ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులకు రూ.47.05 కోట్లు, 65 కి.మీల తారు రోడ్డు కు రూ.22 కోట్లు, 46 కి.మీల మేర సిమెంట్ రోడ్డులకు రూ.20.50 కోట్లు, 304 తాగునీటి సరఫరా పనులకు రూ.8.97 కోట్లు, 332 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.7.62 కోట్లు, 5639 వీధిదీపాల ఏర్పాటుకు రూ.3.70 కోట్లు, 64 ఓ హెచ్ ఎస్ ఆర్ మరమ్మతు పనులకు రూ.2.43 కోట్లు, 21 పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.1.64 కోట్లు, 56.30 కి.మీల బిటి రోడ్ల మరమ్మతులకు రూ.1.53 కోట్లు, ఆర్ అండ్‌బి నూతన భవనం నిర్మాణానికి రూ.1.40కోట్లు, 725 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.08కోట్లు, అన్నా క్యాంటీన్ల నిర్మాణానికి రూ.66లక్షలు, రూ.36 లక్షల ఖర్చుతో వెయ్యి గ్యాస్ కనెక్షన్‌లు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కి రూ.18 లక్షలు, ఎన్‌టిఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కుప్పం, సెంట్రల్ పార్క్, తదితర మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు రూ.1కోటి, రూ.5 కోట్లతో టాటా ఎండి డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటుకు ఖర్చు చేశామన్నారు. వీటితో పాటు రూ. 1167.61 కోట్లతో వివిధ పనులు మంజూరు చేశామని అవి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే రూ.564 కోట్లతో 32,106 వ్యవసాయ ఫీడర్లకు సోలారైజేషన్, రూ. 10.21 కోట్లతో 331 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువల నిర్మాణం రూ.87.08 కోట్లతో 214 చెరువులు, చెక్ డాంల నిర్మాణం మరమ్మతులు, రూ.47.58 కోట్లతో 11 ప్రధాన దేవాలయాల అభివృద్ధి, రూ.38.45 కోట్లతో 120.03 కిలోమీటర్ల మేల ఆర్ అండ్ బి తార రోడ్ నిర్మాణం రూ. 37.95 కోట్లతో 17.42 కిలోమీటర్ల హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ లైనింగ్ పనులు, రూ. 33.67 కోట్లతో టిటిడి ద్వారా 141 చిన్న దేవాలయం అభివృద్ధి, రూ. 27.25 కోట్లతో 55.48 కి.మీ ల సిమెంట్ రోడ్డు, రూ.21.80 కోట్లతో 7489 ఎస్సీ ఎస్టీ గృహాలకు సోలోరైజేషన్, రూ. 20.79 కోట్లతో 904 గోకులం షెడ్లు, రూ. 19.77 కోట్లతో 13,180 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం రూ. 18.01 కోట్లతో ఏడు 33/11 కేవీ సబ్ స్టేషన్ లు, రూ. 10.36 కోట్లతో 35 ప్రాథమిక పాఠశాల అభివృద్ధి, రూ. 8.22 కోట్లతో ఎన్టీఆర్ సుజల స్రవంతి, రూ. 6.87 కోట్లతో 14 హాస్టల్ మరమ్మతులు, రూ. 2.6 కోట్లతో నాలుగు అన్న క్యాంటీన్‌లు, రూ.2.60 కోట్లతో 13 గ్రామపంచాయతీ భావన నిర్మాణాలు, రూ.1.57 కోట్లతో మూడు కుప్పం ఏరియా హాస్పిటల్ అభివృద్ధి పనులు, రూ.1.52 కోట్లతో 40 ఓ హెచ్ ఎస్ ఆర్ మరమ్మతు పనులు, రూ. 85 కోట్లతో ఏడు మున్సిపాలిటీ అభివృద్ధి పనులు, రూ. 58.08 కోట్లతో 162.58 కి మీ తారు రోడ్ల నిర్మాణం, రూ. 2.89 కోట్లతో 428 కేర్ ఎన్ గ్రో ప్రాథమిక బాల్య అభివృద్ధి కేంద్రాల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా కుప్పం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.1282 కోట్ల మేరకు పనులు కొనసాగుతున్నాయన్నారు. వీటిని వచ్చే ఏడాది పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో 3041 పెన్షన్‌లను అదనంగా అందజేశామని, వెయ్యి మందికి గ్యాస్ కనెక్షన్లు అందించామని, ఈఎస్ఎల్ సంస్థ ద్వారా 400 మందికి ఈ సైకిల్ లు, భారత ప్రభుత్వం మరియు అలింకో సంస్థ ద్వారా 1245 మందికి ట్రై సైకిల్ లు మరియు వీల్ చైర్ లు అందించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా కుప్పం అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో కలసి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఒక సంవత్సర పరిపాలన కాలం లోనే నియోజకవర్గంలో రూ.1200 కోట్ల పైచిలుకు అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేశారన్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రాన్ని విధ్వంసం నుండి వికాసం వైపుకు తీసుకెళుతున్నారన్నారు. సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి 2024 వరకు ఒక ఎత్తని, 2024-2029 వరకు జరిగే అభివృద్ధి మరొక ఎత్తని తద్వారా నియోజకవర్గం స్వర్ణ కుప్పంగా మారనుందన్నారు. స్థానికులు బెంగళూరు, మద్రాసు పట్టణాలకు వలసలు వెళ్లకుండా పరిశ్రమలు తీసుకురావడం జరుగుతుందని, 16,000పై చిలుకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఎంఓయూలు చేస్తున్నామన్నారు. 8 పర్యాయాలు నారా చంద్రబాబు నాయుడుని ఏంఎల్ఏగా గెలిపించారని వారికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలవాలన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. మీమీ గ్రామాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన మంచిని గురించి అందరికీ తెలియజెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చూస్తున్నదన్నారు. సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా సూపర్ 6 పథకంలో భాగంగా పెన్షన్‌ల మంజూరు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం లాంటి పథకాలను అమలు చేశారన్నారు. అభివృద్ధిపరంగా 80శాతం గ్రామాలలో సిసి రోడ్డులు వేశామన్నారు. గ్రామాల్లో తాగునీటి వసతి, బస్‌షెల్టర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామని, ఇంత అభివృద్ధి చేస్తున్నా మన ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రచారం చేసుకోలేకున్నామని, తద్వారా ఇతరులు ఈ ప్రభుత్వం ఏమి చేయడం లేదని వ్యతిరేక ప్రచారం చేస్తున్నదన్నారు. తాము చేసిన మంచి పనులను చెప్పేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి నేటి నుంచి 30 రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం జరుగుతుందన్నారు. విమర్శ కుల నోరు మూతపడేలా జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతిఒక్కరికీ తెలియజెప్పాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో అదనంగా మంజూరు చేసిన 3041 మందికి చెందిన సామాజిక పెన్షన్ల మెగా చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ సంస్థలకు చెందిన స్టాళ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలించి అక్కడి ప్రతినిధులతో వాటి వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో జెసి జి.విద్యాధరి, కడ పీడీ వికాస్ మర్మత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నూతన గ్యాస్ కనెక్షన్లు అందజేత

విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు, ట్రై సైకిళ్లు పంపిణీ



కొత్తగా 3,041 మందికి పింఛన్లు అందిస్తూ మెగా చెక్కు అందజేత

ప్రజలకు ఉచిత క్వాలిటీ వైద్యం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజలకు ఉచిత క్వాలిటీ వైద్యం కొరకు 11 పీహెచ్సీలు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలో టాటా కన్సల్టెన్సీ, డిజిటల్ నర్వ్ సెంటర్ ద్వారా అనుసంధానమై ఆరోగ్య సేవలు అందించడం జరగబోతుంది. బుధవారం కుప్పం డిజిటల్ నర్వ్ సెంటర్ ద్వారా ట్రైల్ రన్‌లో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి మాట్లాడుతూ గర్భవతి కాలంలో యోగ అభ్యాసం ఎలా చేయాలి, దాని వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేశారు. ఎన్‌సిడి, సిడి వ్యక్తుల ఆరోగ్య సమాచారంలో చికిత్స అందించుటలో ఆరోగ్య సిబ్బంది పాత్ర, చికిత్స విధానం తృప్తికరంగా ఉందా అనే వివరాలు వారి నుంచి డిఎంహెచ్ఓ అడిగి తెలుసుకున్నారు. ఈ ట్రైల్ రన్ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ కృష్ణబాబు, సిఎఫ్‌డబ్ల్యూ వీరపాండ్యన్, డిసిహెచ్ఎస్ పద్మాంజలి పర్యవేక్షించారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మునిసిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో తాత్కాలికంగా సమ్మెను విరమింపచేసినట్లు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాటం : షణ్ముగం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో అపోలో యాజమాన్యం ఉందని తెలుగుదేశంపార్టీ బీసీ నాయకులు షణ్ముగం ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపోలో వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన కుమార్తె శ్రీదుర్గా మరణించిందని అయితే అపోలో యాజమాన్యం జరిగిన తప్పును సరిదిద్దుకోకుండా వందల సంవత్సరాల చరిత్ర జరిగిన ప్రభుత్వ ఆసుపత్రిని వ్యాపారసంస్థగా మార్చి పేద బడుగు బలహీన వర్గాల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. తన కుమార్తె మరణానికి న్యాయం జరిగేంత వరకు న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టు దాకైనా వెళ్లడానికి సిద్ధమవుతానే తప్ప అపోలో యాజమాన్యం చిత్తూరు నుండి వెళ్లేంతవరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తానని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో యాజమాన్యం చెర నుండి విముక్తి పరిచి ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వపరంగానే నడిపించాలని కోరారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు షణ్ముగం

'సుపరిపాలన తొలి అడుగు'ను ప్రారంభించిన సిఎం

తిమ్మరాజుపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం పాల్గొన్న సీఎం చంద్రబాబు

ప్రజాశక్తి- శాంతిపురం: తిమ్మరాజుపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ప్రచారంను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి అందరూ బాగున్నారా.. అంటూ అప్యాయంగా పలకరించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఉన్న వారి వివరాలు, పిల్లలు ఎంత వరకు చదువుకున్నారు, డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారా.. గ్యాస్ కనెక్షన్ ఉందా లేదా అంటూ కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఓ ఇంటిలో తమకు బాత్రూం లేదని చంద్రబాబు ఓ గృహిణి దృష్టికి తేవడంతో బాత్రూం కట్టుకునేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిమ్మరాజుపల్లికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తిని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందడానికి ఆవులను కొనుగోళు చేయానలి సూచించి ఆ మేరకు సాయం చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.



బంగారుపాళ్యంలో ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన సుపరిపాలనను ఇంటింటికి వెళ్లి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వివరించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధి.. అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు సీఆర్ రాజన్, మేయర్ ఎస్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని వడ్రాంపల్లె పంచాయతీ పరిధిలో సుపరిపాలనతో తొలి అడుగు ఇంటింటి కార్యక్రమం

చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల

బుధవారం జరిగింది. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ వడ్రాంపల్లె, దామరగుంట, మిట్టిండ్లు, లింగారెడ్డి యిండ్లు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలులో ఉన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం పజల నుండి విన్నతులు స్వీకరించారు.

రొంపిచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి పులిచెర్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీ నుండి ప్రారంభించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని గంగాధర నెల్లూరు పంచాయతీ మోతరంగనపల్లెలో టిడిపి ఆధ్వర్యంలో

పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ఎంపి ప్రసాద్ రావు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను నాయకులతో కలిసి పంపిణీ చేశారు. నాయకులు కృష్ణమ నాయుడు, స్వామి దాస్, దేవసుందరం, శ్రీధర్ యాదవ్, జ్యోతి రెడ్డి, పుష్పరాజ్, అశోక్ నాయుడు, మురళీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని సంక్రాంతిపల్లి పంచాయతీలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ సుపరిపాలన, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. టిడిపి గౌరవాధ్యక్షులు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి ఏడాది పాలన పట్ల జనమోదం లభించిందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండలం పరిధిలోని కొంగాటంపంచాయతీలో గల పడిగల కుప్పం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం ఏడాది కాలంగా ప్రజలకు తమ సుపరి పాలనలోఅందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. దొరబాబు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్, రాంబాబు, చౌడప్ప, చంద్రశేఖర్, ధీరజ్ పాల్గొన్నారు.

దారి చూపితే పిల్లల్ని బడికి పంపుతాం..

విద్యార్థులను బడికి పంపని తల్లిదండ్రులు సమస్యను పరిష్కరిస్తామన్న చల్లా బాబు

ప్రజాశక్తి- రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లి గ్రామం సమీపంలో హైవే సమస్య కారణంగా దారి సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గత నెల రోజులుగా బండకిందపల్లి గ్రామప్రజలు పలు రకాలుగా నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు దారి చూపిస్తే పిల్లలను బడికి పంపుతామని లేకపోతే పంపమని తెగేసి చెప్పారు. దీంతో బుధవారం కూడా విద్యార్థులు ఎవరు పాఠశాలకు హాజరు కాలేదు. ఈ విషయంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంతగా నచ్చచెప్పినా పిల్లల భద్రత దృష్ట్యా వారు వినలేదు. ఈ విషయాన్ని గ్రామస్తులు పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ఆయన సమస్యాత్మక స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బండకిందపల్లి పాఠశాలలో 54 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వీరిలో 40 మందికి పైగా నేషనల్ హైవే రోడ్డు దాటుకొని రావాల్సి ఉందని, దారి సౌకర్యం లేకపోవడంతో 40 మంది విద్యార్థులు బడి నిలిపివేశారని తెలిపారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకు మద్దతుగా మిగిలిన 14 మంది విద్యార్థులు కూడా బడి హాజరు కాలేదని చెప్పారు. పాఠశాలకు విద్యార్థులు వచ్చేందుకు తాత్కాలికంగా దారి వేస్తామని నేషనల్ హైవే వారు చెప్పిన తల్లిదండ్రులు ఒప్పుకోలేదని, శాశ్వతమైన దారి చూపితేనే పాఠశాలకు పిల్లలను పంపుతామని చెప్పడంతో చల్లా రామచంద్రారెడ్డి నేషనల్ హైవే సూపర్వైజర్ విజయకుమార్‌తో మాట్లాడి 150 మీటర్ల దూరం రోడ్డు వేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. దీనికి నేషనల్ హైవే వారు రోడ్డు వేసేందుకు అంగీకరించారు. గ్రామస్తులు వ్యవసాయ పొలాలకు వెళ్లాలన్నా పశువులు మేపుకొనుటకు వెళ్లాలన్న దారి సమస్య ఇబ్బందిగా మారిందని గ్రామస్తులంతా నిరసనకు దిగారు. చల్లా రామచంద్రారెడ్డి గ్రామస్తులతో సమస్య పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటున్నట్టు చెప్పి హామీ ఇవ్వడంతో వారు నిరసనను విరమించారు. కార్యక్రమంలో మండలం టిడిపి అధ్యక్షుడు ఉయ్యాల రమణ, టిడిపి నాయకులు ఊటుకూరు కోటేశ్వర్ రెడ్డి, మదన్మోహన్ రెడ్డి, సర్పంచ్ అన్సర్ బాష, లాల్ బాషా, అహ్మద్ బాషా, సలీం, జహీద్, కరీముల్లా, నౌషాద్, ఖాదరవల్లి, బారేషా, సయ్యద్ అలీ, ఇర్ఫాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

దారి సమస్యను చలా బాబుకు వివరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎస్వీయూలో కొనసాగుతున్న
అకడమిక్ కన్సల్టెంట్ల ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - క్యాంపస్ : 2024-25 విద్యా సంవత్సరంలో అకడమిక్ కన్సల్టెంట్లు/కోఆర్డినేటర్ల పనితీరుపై సమీక్ష కమిటీ సమావేశాలు, ఇంటర్వ్యూలు 2 వ రోజు బుధవారం కొనసాగుతున్నాయి. ఈ సమీక్షలు 1 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు జరుగుతాయి. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అప్పారావు ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, వివిధ శాఖల అధికారులతో కలసి ఈ సమీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. జువాలజీ, అనిమల్ బయోటెక్నాలజీ, కామర్స్, ఫార్మసీ కళాశాల అభ్యర్థులకు జరగాల్సిన స్థానంలో న్యాయ కళాశాల అభ్యర్థులకు ఈరోజు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ముక్కంటి ఆలయానికి విరాళాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేకంగా నిర్వహించే శనీశ్వర స్వామి తైలాభిషేకానికి ఊరందూరు వద్ద ఉన్న విష్ణు కెమికల్స్ పరిశ్రమ ఎండీ చెరుకూరి కృష్ణమూర్తి దంపతులు లక్షా 9 వేలా 500 రూపాయలను బుధవారం విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఈవో బాపిరెడ్డికి అందజేశారు. హైదరాబాద్, బీరంగూడకు చెందిన పెద్దిశెట్టి శంకర్ ప్రసాద్ కుటుంబం బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.5558 విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు.

తిరుమలలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-తిరుమల: తిరుపతి, తిరుమలలో రవాణా శాఖ, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాహన యజమానులకు అపరాధ రుసుమును విధిం చారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తిరుమల జీఎన్ సీ టోల్గేట్ వద్ద తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, వెంకట రమణ నాయక్‌లు 45 వాహనాలను తనిఖీ చేసి 22 వాహనాలు రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతుండడంతో ఆ వాహనాలకు రూ.1,31,220 రూపాయల జరిమానాలను విధించడం జరిగిందన్నారు. నిబంధనలను ఉల్లంఘించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్ట్..

రూ.14 లక్షల స్వాధీనం

ప్రజాశక్తి - తిరుమల: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల పేర్లను, అడ్డుపెట్టుకుని కళాకారుల నుండి లక్షల రూపాయలు మోసగించిన వ్యక్తిని తిరుమల వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 14 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లా, కాజీపేటకు చెందిన సూత్రపు అభిషేక్ (28) తిరుమలలోని ఆస్థాన మండపం "శ్రీనివాస కళార్చన" పేరుతో రెండు రోజుల నాట్య కార్యక్రమాన్ని నిర్వహిస్తానని చెప్పి, హిందూ ధర్మ ప్రచారాపరిషత్ అధికారిక అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళాబృందాలకు చెందిన 2,900 కళాకారులను నమ్మించి మోసం చేసి, వారి వద్ద నుండి మొత్తం 35 లక్షల రూపాయలు వసూలు చేశాడు. కళాకారులకు వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, మెమెంటోలు, శాలువలు వంటి సదుపాయాలు అందిస్తామని హామీ ఇచ్చాడు. అయితే, అతనికి టిటిడి అధికారిక అనుమతి లేదని, ఈ మొత్తం ప్రక్రియ మోసపూరిమని తిరుమల ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అనిపై కేసు నమోదు చేశారు. ధర్యాప్తులో భాగంగా తిరుమల డిఎస్పీ విజయశేఖర్ ఆదేశాలతో ఒన్ టౌన్ సి.ఐ జి. విజయ కుమార్, ఎస్.ఐ రమేష్ బాబు, సిబ్బంది మంగళవారం అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. అతన్ని తిరుపతి కోర్టులో హాజరు పరిచారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

- ప్రభుత్వ మద్దతు ధర అమలు చేయాలి
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి

మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి రైతుల కన్నీళ్లు పెడుతుంటే ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి కష్టాలు పెడుతోందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి మండి పడ్డారు. గంగాధర నెల్లూరు మండలం లోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద బుధవారం ఫ్యాక్టరీ ఎదుట కిలోమీటర్ల మేర మామిడి ట్రాక్టర్లతో నిలుచున్న రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసు కున్నారు. అక్కడ ఉన్న రైతులు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, కృపా లక్ష్మికి ప్రభుత్వం తమను పెడుతున్న ఇబ్బందిని, రైతులు పడుతున్న కష్టాలను వివరించారు. ప్రభుత్వం జూన్ 7వ తేదీ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో చర్చలు నిర్వహించగా ఎయిట్ ఫిఫ్టీ ఫోర్ అమలు చేస్తామని మోసపూరితపు హామీ ఇచ్చారని, నేటి వరకు ఏ కర్మాగారంలోనూ ఎయిట్ ఫిఫ్టీ ఫోర్ అమలుకాలేదన్నారు. చర్చలు మే నెలలోనే నిర్వహించి వుంటే నేడు రైతు పడుతున్న ఇబ్బందులు ఉండేవి కావన్నారు. రైతు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉందని మండిపడ్డారు. అధికారులు దొడ్డి దారిన టోకెన్ లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని. రైతుల కష్టాలను విన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపా లక్ష్మి కూటమి ప్రభుత్వం మామిడి రైతుల జీవితాలతో ఆటలాడుకోవడం మంచిది కాదని రైతులు తిండి నిద్ర లేకుండా రోడ్లపై పడిగాపులు కాస్తుంటే ఇలా చేయడం దారుణమన్నారు. రోడ్లపై మామిడి ఉన్న రైతులకు నారాయణ స్వామి, కృపా లక్ష్మి, చేతుల మీదుగా అన్న దానం, మజ్జిగ, వాటర్ బాటిళ్లు అందిం చారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, వైసిపి నాయకులు వేలు మొదలి, సురేందర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యం..

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురు కుప్పం మండలంపచ్చికాపల్లం ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా శుభ్రతే లక్ష్యంగా పచ్చికాపల్లం కార్యదర్శి వెంకటేష్‌యులు వీధుల పక్క బుధవారం పురవీధులను శుభ్రం చేశారు. చెత్త గాలికి ఎగిరిపోకుండా చెత్తను కుప్పలుగా పోశారు. ఆయన సేవలను చూసి పలువురు ప్రశంసించారు.

అన్నదాన సత్రం తనిఖీ

ప్రజాశక్తి-ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నిత్యాన్నదాన సత్రంను ఆలయ ఈవో పెంచల కిషోర్ బుధవారం తనిఖీ చేశారు. అన్నదానంలో భోజనం రుచిపై భక్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు నిత్యం ఇదే రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదానం ఏఈఓ కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

'యువతలో సామాజిక ప్రభావం' పై అవగాహన

ప్రజాశక్తి - వెదురుకుప్పం: డాక్టరు వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజియట్ ఎడ్యుకేషన్ ఆదేశా ల మేరకు 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' యువతలో సామాజిక ప్రభావంపై విద్యార్థులకు బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు బి అన్నపూర్ణ, శారద అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ సమస్యల పరిష్కారానికి యువత ఆవిష్కరించాల్సిన అంశాలు వివరించారు. సమన్వయకర్త డాక్టరు పి వెంకటేశు మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఉపయోగ పడుతుం దన్నారు. కోఆర్డినేటర్లు డాక్టరు ఎల్ఎం భక్షు, వై శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సమస్యలను గుర్తించి వాటికి విద్యార్థులు తగిన సాంకేతిక లేదా వినూత్న పరిష్కారాలు సూచించాలనే లక్ష్యంతో వివిధ సూచనలు అందించారు. విద్యార్థులు తమకు అనుకూలమైన ప్రాజెక్టులపై పని చేయాలనే స్ఫూర్తిని పొందారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమ తెరలు విధిగా వాడాలి

ప్రజాశక్తి- వెదురుకుప్పం : డెంగీ నివారణకు దోమ తెరలు విధిగా వాడాలని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె చెంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పచ్చికాపల్లం ఆరోగ్య ఉప కేంద్రం, వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డెంగీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పట్టు బాలకృష్ణారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన కిషోర్‌రెడ్డి

మాజీ సీఎంను కలిసిన కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వైసిపి అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని గంగాధర నెల్లూ రు వైసిపి యువజన విభాగం అధ్యక్షులు కిషోర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో భాగంగా కిషోర్ రెడ్డి మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సోమల: వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో యువజన విభాగం పుంగనూరు నియోజకవర్గ వైసీపీ యూత్ అధ్యక్షులు టి కిరణ్ కుమార్ బుధవారం కలిసి నియోజకవర్గ పరిస్థితులు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ఆశీస్సులతో తాను ఉన్నత పదవులకు చేరుకున్నానని వారికి ఎల్లవేళలా కృతజ్ఞతతో ఉంటానని, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలతో కలుపుకొని వెళతానని తెలిపారు.

కంప్యూటర్ విజ్ఞానంపై అవగాహన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ , కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో, ఐక్యూఏసి పర్యవేక్షణలో, 'విద్యకు ఏఐ సాధనాలు' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు ఎన్‌విఎస్ ప్రభుత్వ మహిళా కాలేజీ అధ్యాపకులు వై జ్ఞాపిక హాజరయ్యారు. విద్యా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాల వినియో గం, వాటి ఉపయోగాల గురించి తెలిపారు. చాట్‌బాట్‌ల రూపకల్పనపై ప్రాథమిక అవగాహన కల్పించి విద్యార్థులలో సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని, తమ సందేహాలను తెలిపారు. ముఖ్య అతిథిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు బి అన్నపూర్ణ శారద సన్మానించారు.

పాఠశాలను తనిఖీ చేస్తున్న అధికారి శశిధర్

ప్రాథమిక పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలోని ఇరికిపెంట, నంజంపేట ప్రాథమిక పాఠశాలలను జిల్లా సర్వ శిక్ష అభియాన్ మానిటరింగ్ అధికారి శశిధర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలలో విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు పరిశీలించి ఒకటవ తరగతిలో చేరాలనుకున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బడిబాట నిర్వహించి విద్యార్థులను చేర్పించుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సిఎంఓ మధుసూదన్ మాట్లాడుతూ యాప్‌ల నిర్వహణ, సమయ పాలనతో కూడి ఉండాలని కోరారు. అంతకు ముందు ఎంఈఓ కేశవరెడ్డి పాఠశాలలను తనిఖీ చేశారు.

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఓ నారాయణ

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ పనులను ఎంపీడీవో నారాయణ బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పరిశీలించి పంచాయతీ కార్యదర్శి జయశంకర్ కు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రానున్న వర్షాకాలం వర్షపు నీరు నిలువ ఉండడం మురుగు నీటితో వర్షపు నీరు కలవడం కారణంగా దోమలు వృద్ధి చెంది తద్వారా ప్రజలను కుట్టి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని నిరంతరం పారిశుద్ధ్య పనులు చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు పంచాయతీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు విశ్లేషించడమే నిజమైన జర్నలిజం

రాష్ట్ర సిపిఎం నాయకులు దడాల సుబ్బారావు

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - వికోట : ప్రస్తుత సమాజంలో ప్రజలు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించి వెలికితీయడమే నిజమైన జర్నలిజమని రాష్ట్ర వ్యవసాయ కూలీల నేత, రాష్ట్ర సిపిఎం నాయకులు దడాల సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన వికోటలో చిత్తూరు జిల్లా ప్రజాశక్తి విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విలేకరులు సమకాలీన రాజకీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద , బడుగు, బలహీన వర్గాలతో పాటు రైతులు , కార్మికుల కష్టాల గుర్తించి వారి సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేసేందుకు అనుగుణంగా పాత్రికేయులు తమ కలాలకు పదును పెట్టాలని సూచించారు. ప్రస్తుత పాలకుల విధానాల పట్ల ప్రజలను చైతన్య పరిచేలా విశ్లేషణాత్మక కథనాలను అందించా లన్నారు. అప్పుడే నిజమైన జర్నలిజానికి గుర్తింపు, ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందన్నారు. రైతులు పడుతున్న అవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలను ఎంతమేరకు నెరవేర్చారన్న సమగ్ర విశ్లేషణాత్మక కథనాలను అందించాలని సూచించారు. పాత్రికేయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యాజమాన్యం కల్పించే శిక్షణ తరగతులను సద్విని చేసుకోవాలని ఈ సందర్భంగా అతిథులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ హరికృష్ణ , మేనేజర్ ప్రసాద్, తిరుపతి డెస్క్ ఇన్‌ఛార్జ్ వనజ , తిరుపతి బ్యూరో గోపి, సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, డివిజన్ కోఆర్డినేటర్లు, పాత్రికేయులు, పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీవో

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఫారం ఫండ్ పనులను ఏపీఓ షౌకత్ అలీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ పొలాలలో ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులను చేయించుకుని లబ్ధి పొందవచ్చునని ఇందుకోసం పంచాయతీ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ లను కలిసి వివరాలు తెలుసుకోవచ్చని లేదా ఉపాధి హామీ కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకుని తమ పొలంలో అభివృద్ధి పనులు చేయించుకోవచ్చునని తెలిపారు. ఫారం ఫండ్ పనులు చేయడం ద్వారా వర్షం కురిసినప్పుడు నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెంపొందే అవకాశం ఉంటుందని అన్నారు.

మాజీ సీఎం దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ డి.వి డిల్లెయ్య తనయుడు పవన్ ప్రసాద్ మాజీ ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. బుధవారం విజయవాడలోని తాడేపల్లి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ డివి డిల్లయ్య తనయుడు పవన్ ప్రసాద్ కలిశాడు. ఆయనకు శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని సమస్యలు, సోషల్ మీడియా, కూటమి ప్రభుత్వం పనితీరుపై పనితీరును ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే రోజుల్లో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి చేయూత అందిస్తామని తెలియజేసినట్లు మీడియాకు తెలిపారు.

శేష వాహనంపై ద్రౌపదీ ధర్మరాజుల స్వామి

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు శేషవాహనంపై పురవీధులో ఊరేగారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, చేపట్టి ప్రత్యేకంగా ఆలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపదీ మాన సంరక్షణ ఘట్టాన్ని భక్తులకు కన్నులకు కట్టినట్లుగా హరికథను వివరించారు. వాసుదేవరాజు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి ఊరేగింపుగా ఉభయ దారులైన క్షత్రీయకులస్తులు సారెను సమర్పించారు. దీంతో ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామిని పట్టు వస్త్ర సుగంధపుష్పాలు, వివిధ రకాల ఆభరణాలతో అర్చకులు కుమారస్వామి ఆచారి ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై పవళించిన స్వామివార్లను ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి నగర వీధులలో ప్రత్యేక వాయిద్యాల నడుమ బాణా సంచా పేల్చి అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రంలో ఆలయ ఆధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యాక్షుడు కట్ల రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయిరాయల్, అర్చకులు సుమన్, బాబు ఆచారి, కుమార్ ఆచారి పలువురు వ్యవహరించారు.

క్రైం న్యూస్

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.75 వేల నగదు, రూ. రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం

పోలీసుల అదుపులో అంతర్ రాష్ట్ర దొంగ ధరనీసాయి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మూసివున్న ఇల్లు, ఆఫీసుల్లో చొరబడి చోరీకి పాల్పడే అంతర్ రాష్ట్ర దొంగ ధరనీసాయి (35)ను నగరి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సిఐ విక్రమ్ కథనం మేరకు.. గత నెల 8వ తేదీ కొండమట్టు మండపం ఏరియాలో లాయర్ లోకేష్ ఆఫీసులో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి లక్ష రూపాయల నగదు, రెండు మొబైల్ ఫోన్లు చోరీ చేశారు. ఈ విషయమై లోకేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎస్‌పి, డీఎస్‌పి సూచనలతో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా అందిన సమాచారం మేరకు ఓంశక్తి గుడి వద్ద కాపుకాసిన పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ధరనీసాయిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరానికి పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతని నుండి చోరీకి గురైన నగదులో రూ. 75 వేల రూపాయలు, రూ. 40 వేల రూపాయల విలువ చేసే రెండు మొబైలు ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై గతంలో తిరుత్తణిలో దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన ఎస్ఐ విజయ నాయక్, సిబ్బంది లోకనాథం, గోపి, సత్య, గజేంద్ర, అశోక్, రమేష్‌లను అభినందించారు.

మహిళపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కేసు నమోదు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : గత నెల 29వ తేదీ పొలం వద్ద నిద్రిస్తున్న మహిళపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు అదే రోజు బైరెడ్డిపోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు పరిశీలించి బుధవారం మహిళపై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలోని కామినేనిపల్లి గ్రామం లోని ధనలక్ష్మి (23) గత నెల 29వ తేదీ రాత్రి పొలం వద్ద ఉన్న ఇంటి ముందు కుటుంబ సభ్యులుతో నిద్రిస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు హఠాత్తుగా కత్తితో దాడికి పాల్పడ్డారు. ఆమె అరుపులు వినడంతో భర్త మురళి లేచి చూడగా అతనిపై ఆ వ్యక్తులు కారంపొడి చల్లి అతని ఎడమ చిటికెన వేలును కత్తిరించారు. ఆ తర్వాత బైరెడ్డిపల్లి ఆస్పత్రిలో వారు చికిత్స చేయించుకున్నారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు సిఫార్సు చేయగా 108 సాయంతో ఏరియా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పరిశీలించిన పోలీసులు మహిళపై దాడి కేసుగా నమోదు చేసి క్రైమ్ నెంబరు 62/2025,118,(1) ఆర్‌డబ్ల్యు, 35 (బిఎన్ఎస్) కేసు సెక్షన్లు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కార్వేటినగరం : రెండు రోజుల క్రితం కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవానంలో వెళుతూ కిందపడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కార్వేటినగరం మండలం కత్తెరపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం (68) ఆదివారం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో కింద పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారి కుటుంబ సభ్యులు తిరుపతి పద్మావతి హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆరోగ్యం విషమించడంతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మృతి చెందారు. మృతుడు కృష్ణాపురం జలాశయంలో లస్కర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. ఇతనికి భార్య, కుమారుడు వున్నారు. సుబ్రహ్మణ్యం కుమారుడు షణ్ముగ యాదవ్ పోలీసుల ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పలమనేరు టు కుప్పం జాతీయ రహదారిలో మొరం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన హరి స్వగ్రామానికి వెళు తుండగా తమిళనాడుకు చెందిన ఫైనాన్స్ కలెక్షన్ చేయడానికి వచ్చిన తమిళ సెల్వం తిరిగి తమిళనాడుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ఇద్దరూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మొరం గ్రామానికి చెందిన హరికి తీవ్ర గాయాలయ్యాయి. తమిళనాడు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వీరిని గమనించిన స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించారు.

బ్రిడ్జిపై నుండి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నూతనంగా నిర్మిస్తున్న చెన్నై -బెంగళూరు జాతీయ రహదారి నిర్మాణం బ్రిడ్జిపై నుండి యువకుడు పడి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని మొగిలి వారి పల్లి వద్ద చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్ సతీష్ నగర్ చెందిన దయాల్ మండల్ కుమారుడు ఆశిష్ మండల్ (31) జాతీయ రహదారి బ్రిడ్జి నిర్మాణ పనుల్లో పనిచేస్తుండగా బ్రిడ్జి పై నుండి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అతనికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చిక్కిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కార్వేటినగరం : డీఎంపురం ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హెచ్‌ఎం నాథముని రెడ్డి అధ్యక్షత వహించగా పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ త్యాగరాజ, వైస్ ఛైర్మన్ సంధ్య, గ్రామ పెద్దలు సోమసుందరం పిళ్ళై, సుధాకర్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల పనితీరును వక్తలు కొనియాడారు. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హెచ్ ఎం నాథముని రెడ్డి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు హెచ్‌ఎం కేశవులు, హరిత, సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకట రమణ య్య, ఢిల్లీ బాబు, చిన్నయ చెట్టి, తిరుమల రాజు లను దుశ్శాలువా కప్పి జ్ఞాపికలతో ఘనం గా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు సరస్వతి, మాలతి, కలైవాణి, సుమతి, రాములు, రవి కుమార్, కిషోర్ కుమార్, బొజ్జా రాములు, రంజిత్ కుమార్, హరి, గ్రామ పెద్దలు సోమసుందరం పిళ్ళై, సుధాకర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు రాజీనామా చేయాలి: వైసిపి

రీకాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి సూపర్ సిక్స్ అంటూ అమలుకు వీలు లేని హామీలను గుర్తించి ప్రజలను మోసం చేసి గెలిచాడని అధికారం చేతికి వచ్చిన తర్వాత హామీల అమల్లో విఫలమయ్యారని వెంటనే బాబు రాజీనామా చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి కోరారు. బుధవారం కొత్తపల్లి మెట్ట లోని ఓ కళ్యాణ మండపంలో 'రీకాలింగ్ చంద్రబాబు' అనే నినాదంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు నాయకులతో సమావేశం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయని బాబు వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. మాజీ నారాయణస్వామి మాట్లాడుతూ ప్రజలను మోసగించి బాబు అధికారంలోకి వచ్చారని ఈ విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, ఎన్నికల తర్వాత హామీల అమలు తీరును వివరించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యకర్తలతో మాట్లాడించారు. అనంతరం చంద్రబాబు అనే ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అన్ని మండలాల నాయకులు అధ్యక్షులు వారి అభిప్రాయాలను ప్రజలకు తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కరుణాకర్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, అన్ని మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు ,సర్పంచులు, మండల వైసిపి అధ్యక్షులు, ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడు మణి, జనార్ధన్, కుమార్ కుప్పయ్య, కొత్తపల్లి శ్యాము పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి మండల టిడిపి ప్రముఖులు బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బైరెడ్డిపల్లి సుబ్బన్న కాంప్లెక్స్ వద్ద ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో పాటు మండల టిడిపి శ్రేణులతో కలిసి వికోటలో జన్మదిన వేడుకలకు తరలి వెళ్లారు.

పుంగనూరు: మాజీ మంత్రి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాయుడు, అనిల్, నూరుల్లా, షబీర్, జగదీష్, పులిచర్ల ఇనాయతుల్లా, గురు ప్రసాద్, సయ్యద్, ముబారక్, గంగాధర్, ముజ్జు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సీఎం శుభాకాంక్షలు

వికోట: ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుప్పం నియోజకవర్గ పర్యటన నిమిత్తం వికోట మీదుగా వెళుతున్న ఆయన స్థానిక ఎగువ చెక్ పోస్ట్‌లో తన కాన్వాయ్‌ను కొద్దిసేపు ఆపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వి కోట ఎన్టీఆర్ కూడలి వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు రంగనాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి భారీ కేక్ ను కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి రాంబాబు, ఈశ్వర్ గౌడ్ ,ధీరజ్, శబరిష్, రూహుల్లా, వెంకట రామప్ప, సోము ,చౌడప్ప ,మురుగేష్, కోలాసురేంద్ర పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులో ఎమ్మెల్యే ఎన్ అమరనాథరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.